# కిటికీ



సరికొండ చలపతి

నన్నెందుకు వదిలేశావ్ సుధా!... అనంటే సుధాకర్ ఏమన్నాడు?

'ఆ గొడవంతా ఎందుగ్గానీ ... నేను వదిలేశాను కనుకనే ఇంత ప్రశాంతంగా బతుకుతున్నావు, శారూ!... చాలా అసంతృప్తితో రగిలిపోయే జీవితం నాది. నిన్ను కట్టుకున్న రెండేళ్లకే 'జీవితం ఇంతేనా ... ఇంకేం లేదా?' అని నిన్ను వేధించేవాడిని. ఇప్పటి నీ సుఖమయ జీవనానికి అప్పటి నా నిర్ణయమే కారణం ... అవునా?'

గొప్ప ఫేవర్...

ఇతని అసంతృప్త జీవనయాత్రలో నేనొక మజిలీనయ్యాను. అంతే నాకు దుఃఖం వచ్చింది. కానీ ఏడవకూడదు. వృథాగా కన్నీళ్లు రాల్చేయకూడదు. అవతల జలసంరక్షణోద్యమం జరుగుతోంది. మనసులోనే ఇంకుడు గుంటలు తవ్వి కన్నీళ్లు భద్రపరచుకోవాలి.

సుజలాం...సుఫలాం ...

గుండె తడిగా ఉంటేనేగా ప్రేమలైనా, అభిమానాలైనా... ఏడ్చి ఏడ్చి ఎడారైతే ఇంకేం మిగులుతుంది, ఉత్త కాఠిన్యం తప్ప.

నా ఆలోచనలకు నాకే నవ్వొచ్చింది. నిజమే... నవ్వేయాలి.

మాటలు మందుపాతరలై అనుబంధాలను పేల్చివేస్తుంటే... ఆ నిశ్శబ్ద విస్ఫోటనం - మనసునిండా మౌనమూ, అంధకారమూ నింపేస్తుంటే, పెదాల చివర్నయినా చిరునవ్వు వెలిగించాలి. రాలిన శిథిలాలకింద ఎక్కడైనా కాసింత తడి మిగిలి ఉంటే? వెదకి రక్షించుకోవడానికి.

కోడిపిల్ల తుచ్ఛజీవితానికి మోక్షం ప్రసాదించడానికి దాన్ని గుటుక్కున మింగిన కొండచిలువ చిద్విలాసంగా 'బ్రేవ్'మన్నట్టు తోస్తోంది నాకు సుధాకర్ మాటలు గుర్తుకువచ్చి.

ఛ...ఛ...! ఇవేం ఆలోచనలు? .... అసలు ఆలోచించడానికీ, బాధపడడానికీ అర్హుడా సుధాకర్?

అదిగో, వచ్చేస్తోంది క్రోధమూ, ద్వేషమూ ... మనసు పొలిమేరల్లోకి ద్వేషాన్ని అనుమతించామా ... అది జీవితాన్నే ఎడారిచేసి, జ్ఞాపకాలు తుపానులా చెలరేగితే బాధనే ఇసుక రేణువుల్లా రాలుస్తుంది.

ద్వేషానికి, ప్రేమకు మధ్య ఊగిసలాట.

గాయాల్ని కెలుకుతూ జ్ఞాపకాలు మనస్సును వెనక్కు లాగుతుంటే మిగిలిన కాసింత తడినైనా ఆవిరి కాకుండా ఉంచుకోవడం ఎంత కష్టం!

వరంగల్‌లో సుధాకర్ కలిశాడు. అందుకే మనస్సులో ఈ సందడి. పెళ్లికెళ్లి వస్తున్నానీ రైల్లో. ఉత్సాహంగా పెళ్లికి రావడానికి కారణం రైలు ప్రయాణం చేయవచ్చునన్న ఆలోచన కూడా. ఎన్నిసార్లు ఇలా కిటికీ దగ్గర కూర్చుని ప్రయాణించానో ...!

ఎప్పుడూ కొత్త అనుభూతే! అలా బయటికి చూస్తుంటే ... పరుగెడుతున్న పల్లెలు, పంట చేలు.

ఇక్కడ మొలకెత్తిన బాల్యాన్ని మరచి నేను పరుగెడుతున్నానో? ఏ మాత్రం ప్రేమ నిలుపుకోలేదన్న కినుకతో అవి పరుగెడుతున్నాయో? ...

మొత్తమ్మీద ఒకరికొకరం దూరంగా...

కిటికీ చువ్వలు చల్లగా తాకుతున్నాయి.

ఎంతో ఇష్టమైన స్పర్శ.

మా ఊళ్లో ఉన్న ఇంట్లో పెద్ద కిటికీ ఉండేది. అక్కడ నేనున్న కాలంలో సగం ఆ కిటికీలోనే గడిపాను. నమ్ముతారో లేదో... ఆ కిటికీయే గనుక లేకుంటే నేను చచ్చిపోయేదాన్నేమో అనిపిస్తుంది నాకు.

మా నాన్న అమ్మను గుండెల మీద తంతే

ఎగిరిపడుతూ అమ్మ వేసిన కేక నా నరనరాల్లోకి దూసుకువచ్చి వాటిని ఛేదించకుండా ధైర్యాన్ని, శక్తినీ ఇచ్చింది నేను గట్టిగా పట్టుకున్న ఆ కిటికీ చువ్వలే.

ఇలాంటి సందర్భాలు కోకొల్లలు.

ఇంటినిండా అంధకారం, ద్వేషం, అనుమానం, ప్రేమరాహిత్యం అలుముకుని జీవితాన్ని దుర్భరం చేస్తుంటే ... ఆ ప్రపంచంలో నా పంచప్రాణాలు కరిగిపోతుంటే బయట వెలుగులనూ, ఆనందాల్నీ పట్టి చూపింది ఆ కిటికీయే...!

ఏవో విశ్వాంతరాల నుంచి రహస్యాలు మోసుకొస్తున్నట్టుగా ఆగమేఘాలమీద వచ్చే తెల్లని పత్తిలాంటి మేఘాలనూ... సూర్యోదయ సౌందర్యాన్నీ ... వాన చినుకులు తమతోపాటు నా కోసం మోసుకొచ్చే ఇంద్రధనుస్సునీ ..

పిట్టల పాటల్నీ... ముఖ్యంగా ..

కమలనీ... ఆమె భర్త, బాబుని, వారి సఖ్యతనీ చూపించేది ఆ కిటికీయే!

ఇంట్లో సంఘర్షణకు వెరచి నేను పారిపోతుంటే నాకు చేయుందించింది ఆ కిటికీయే! అమ్మ ఒడికన్నా కంఫర్ట్‌గా తోచేది నాకు! అయినా నిరంతరం కష్టాల్ని మింగి విషాదాన్నే నెమరేసే అమ్మ, ఎన్నిసార్లు నన్ను ఒడిలోకి చేర్చుకోగలిగింది?

అందుకేనేమో నాకు కిటికీయే ఆలంబన అయింది.

ఆరేడు చువ్వలున్న ఆ కిటికీ చాలా విశాలంగా ఉండేది. పైకి ఉన్నదాన్ని ఎక్కడానికి మొదట్లో చాలా ప్రయాసపడేదాన్ని. చిన్న స్టూలు వేసుకున్నా అందేది కాదు. గోడకు చిన్న రంధ్రం చేసి దానిలో కాలివేలు పెట్టి పాకేదాన్ని. పెద్దవుతున్నకొద్దీ ఎక్కడం సులువయింది.

నా పదిహేనేళ్లకు, నాన్నకు ట్రాన్స్‌ఫర్ అయ్యేదాకా ఆ కిటికీయే నా ఆశ్రయం. దానిలోంచి చూస్తే ఎదురుగా ఓ గుడిసె. మా ఇంటికి, ఆ గుడిసెకు మధ్యలో రోడ్డుండేది. కమల ఉండేది ఆ గుడిసెలోనే. వారికో బాబు ... రెండేళ్లలోపే వయస్సు.

కమల అప్పుడప్పుడూ మా ఇంట్లో పనిచేస్తూండేది. అమ్మ మేం తినగా మిగిలినవి కమలకు పెడుతుండేది.

కమల పేరంటే నా కెంతో ఇష్టం. ఆమె నల్లగా ఉన్నా, చాలా కళగా ఉండేది. 'నల్ల చందమామ' అనిపించేది. కాంతివంతమైన కళ్లు.

సాయంత్రం కాగానే కమల భర్త పనికిపోయి వచ్చాక రోజూ చేసే మొదటి పని వాళ్లబ్బాయిని భుజాన ఎత్తుకుని తిరగడం.

నా కెంతో అపురూపంగా అనిపించే దృశ్యం... రోజూ నేను చూస్తుండేదాన్ని.

నే నెప్పుడైనా అలా నాన్న భుజాలపైకి ఎక్కానా? నాకు బుద్ధితెలిసినప్పటినుంచీ లేదు.

ఆ భార్యాభర్త లిద్దరూ ఎంతో సఖ్యంగా ఉండేవారు. నా కిప్పుడు అనిపిస్తోంది. అన్నీ ఆర్థిక సంబంధాలే అయితే పూటపూటకీ తిండికి కష్టపడేవారి మధ్య అంత సఖ్యత, అనురాగం ఎలా సాధ్యమయిందీ అని...!

డబ్బుకు ఏమాత్రం కొదవలేని మా ఇంట్లో ఎప్పుడూ ఆ ఫీలింగ్స్ చూసి ఎరుగను.

ప్రతి ఇంటికో వాసన ఉంటుందని నా అభిప్రాయం. మా ఇంట్లో జీవితాలు కాలుతున్న వాసన.. దుర్భరం!

ఇలాంటివాళ్ల మూలుగులు పీల్చే కుటుంబ ఔన్నత్యం సభ్యసమాజం ముందు రెపరెపలాడుతుంది!

నేను మా అమ్మా, నాన్నల మధ్య నిరంతర ఘర్షణని చూసిన పాతికేళ్లూ నా మనస్సునిండా ఒక్కటే కోరిక ఆవరించేది. వారిద్దరిలా కాక గొప్ప ప్రేమల్లో, అభిమానాల్లో, ఆప్యాయతల్లో నా భర్తతో నేను సహజీవనం సాధించాలనీ... ఆ కోరికే నన్ను నిరంతర ప్రేమాన్వేషిని చేసింది. ఏ జంటను చూసిన వారిద్దరూ సఖ్యంగా ఉన్నారా, లేదా అని పరిశీలించే స్థితిలో పడిపోయాను. ప్రేమైక సౌందర్యాన్నే స్వప్నించాను. ఎవరో తన అనంతమైన ప్రేమతో నన్ను కరిగించి సజీవత్వాన్ని నింపి లాలిస్తారేమోనన్న వెర్రి కలలు కంటూండేదాన్ని.

అలా ఇరవై ఐదేళ్ల నిరీక్షణ ఫలితంగా కనిపించింది సుధాకర్ స్నేహం.

దివ్యమైన తేజస్సుతో బతుకు వెలిగిపోతుందని అనుకున్నాను. ప్చ్.... చివరికేమైంది?

ప్రేమ అపాత్రదానం అయింది. రెప్పపాటులో స్వప్నాలు నేలరాలుతుంటే మౌనంగా, నిర్లిప్తంగా చూడాల్సి వచ్చింది.

మళ్లీ మనస్సు వెనక్కు లాగుతోంది. పెదాలపై చిరునవ్వుల్నీ, సౌందర్యాన్నీ పూయించాల్సిన జ్ఞాపకాలు ... జీవన సంఘర్షణను ఎత్తిచూపుతున్నాయి .... పెళ్లయి నాలుగేళ్లయినా!

"అమ్మా!" ఎవరిదో పాదాలపై చెతి స్పర్శ. ఉలిక్కిపడి కాళ్లు దగ్గరకి లాక్కున్నాను.

రైల్లో అడుక్కునేవాడు. చేయిచాపుతున్నాడు. చాలాసార్లు చూశాన్నితన్ని రైలు ప్రయాణంలో. యుక్తవయస్సే. కానీ, పోలియోతో కాళ్లు చచ్చుబడిపోయి దేకుతుంటాడు. ఓ చేయి కూడా పూర్తిగా వేలాడుతోంది. దయనీయ స్థితి.

కానీ ఆశ్చర్యమేమంటే మొహాన్ని వెలిగిస్తూ చిత్రమైన నవ్వు ... ఏనాడూ బాధనీ, విషాదాన్నీ ఎరగనట్టు ... నిస్సహాయజీవితంలో ఇదెట్లా సాధ్యం అని ఆశ్చర్యమేస్తుంది. నా కెన్నడూ సాధ్యంకాని విషయం.

ఉద్యోగమూ, సంసారమూ, ఇల్లూ వాకిలీ,



## ఆమెతో పోల్చడం నాకు సంతోషం!

అంటూంది ప్రీతిజింటా. ఇటీవల ఆమెను కాజోల్‌తో పోలుస్తున్నారు బాలీవుడ్ జనం. ఆ సంగతే విన్న ప్రీతి దానికి సమాధానంగా-"కాజోల్‌కూ, నాకూ ఏవిధమైన పోలికలూ లేవు-ఇద్దరం సినీనటీమణులమని తప్ప! మా ఇద్దరివీ వేర్వేరు వ్యక్తిత్వాలు. తాను నటించడం ప్రారంభించిన తొలిరోజుల్లోనే చాలాచక్కని పాత్రలు ధరించి పాత్రికేయులూ, విమర్శకులూ-అందరిచేతా ప్రశంసలు పొందిన నటీమణి ఆమె. అలాంటి అభినేత్రితో పోల్చి నాకు గర్వాన్ని కలుగజేస్తున్నారు. అందుకు ఆనందంగా వుంది" అంటూంది. నిజమే కదా, ప్రీతి ఇంకా చాలా సినిమాలు చేస్తే అప్పుడు తెలుస్తుంది ఆమెను కాజోల్‌తో పోల్చాలో వద్దో!

ఎన్.

బ్యాంకు బాలెన్సు, భర్త ... సమస్తమూ ఉండి నే నెప్పుడూ చూడని ఆనందం వీడికెలా సాధ్యం?

ఆ నవ్వు నా కెప్పుడూ నా ఓటమినే చూపుతుంది.

ఉండబట్టలేక ఓసారి అడిగేశా ... "ఇలా ఆనందంగా ఎలా ఉండగలవు?" అని.

నా ప్రశ్నకు ఆశ్చర్యపడ్డాడు.

"నాకేంటమ్మగారూ! బాదరాబందీ ఏమీ లేదు. మీలాంటోళ్లు ఎవరైనా దయతలిస్తే తినడం, లేదంటే అదిగో ఆ మూల పడుకోవడం. ఎవరైనా ఇసుక్కున్నా నాకేం అనిపించదండీ! ఇత్తే ఇత్తారు, లేకుంటే లేదు... అంతే!" అన్నాడు.

ఈ పరుగులూ, ఆస్తులూ, అంతస్తులూ, వెంపర్లాటలూ ... చివరికి ఏ ప్రేమల్నీ ఆశించకుండా ఇలా చిద్విలాసంగా ఉండగలుగుతున్నాడా?

అన్నీ వదిలేస్తే ఇంకేం మిగులుతుందీ? ఏమీ వద్దనుకునే జీవితమేం సుఖమయం?

మరి అన్నీ ఉన్న నా కివేమీ ఎందుకు ఆనందాన్నివ్వడంలేదు? మరి ఏ కోరికలు, ఉత్సాహాలు లేని మనుషి జన్మ ఎందుకు? మరి ఇవన్నీ కావాలనుకుంటున్న నేను పరుగెడుతున్న 'రవి'ని ఎందుకు విస్మరించడం?

గొప్ప సంఘర్షణ... పరస్పర విరుద్ధమైన ముళ్లేవో బాధిస్తున్నాయి.

నాలుగేళ్ల క్రితం మూడు లక్షలు పోసి 'రవి'కి కట్టబెట్టారు నన్ను. గవర్నమెంటు ఉద్యోగి. పైగా అదనపు రాబడి. పెళ్లి చూపుల్లో కనీసం కన్నెత్తయినా చూడని రవి, నన్ను చూసి చేసుకున్నాడో... లక్షలను చూసి చేసుకున్నాడో అనిపించింది. పెళ్లయ్యాక తెల్సింది రెండోదేనని.

రవి డబ్బు చుట్టూ పరుగెత్తే మనిషి. ఉద్యోగంపై వచ్చే ఆదాయమే కాదు, చిట్టీలు, వడ్డీలు... ఫైనాన్సులు ... లక్షలు సంపాదించాడు. కోట్లకు ఆశపడుతున్నాడు. మనిషి దుర్మార్గుడేం కాదు.


ప్రేమలు తెలియవంటే ... నన్ను ప్రేమిస్తాడు. కానీ, ప్రతి నెలా ఒకటో తారీఖున ప్రేమిస్తాడు.

ఓ జంతువులా బతికే స్వభావం. ఆనందాన్ని, అవకాశాన్ని అవసరమైతే దాడి చేసైనా పక్కవాడి నుంచి లాక్కునేవాడు.

రవితో జీవితంలో ప్రేమ ఎండమావే.

సుధాకర్ ఇచ్చిన షాక్ నుంచి తేరుకుంటూ, మరో ప్రేమాస్పదమైన చేతిని కోరిన నాకు నిరుత్సాహమే మిగిలింది.

నన్నొక్కదాన్నే కాదు ... నాలుగేళ్ల కాపురంలో రవి ఎవర్నీ ప్రేమించగా ఎరుగను నేను. డబ్బు చుట్టూ ప్రపంచాన్ని నిర్మించుకుని, మరో




మనిషిని... చివరకు నన్నూ అడుగిడనీయని మనిషి.

"రవీ! ఎందుకీ డబ్బుపిచ్చి నీకు? ఎంతకాలం ఇలా పరుగులు? ఇద్దరం సంపాదిస్తున్నాం. కావాల్సినంత బాంకు బాలెన్స్ ఉంది. ఎన్నిరోజులైంది మనం కలసి భోంచేసి? ఎన్నడైనా సాయంత్రం అలా షికారుకెళ్లామా? కూర్చుని కబుర్లు చెప్పుకున్నామా? విసుగుపుడుతోంది జీవితం. ప్లీజ్... ఈ ఫైనాన్స్ వ్యవహారాలన్నీ మానేయ్!" అన్నానోసారి.

"నువ్వు ఆ నవలలూ, కథలూ చదవడం మానెయ్, శారదా! జీవితం అంటే రొమాంటిసిజం కాదు. ప్రాక్టికల్ లైఫ్ వేరు. ఏ కష్టమూ లేకుండా హాయిగా తిని తిరిగే నువ్విలా మాట్లాడటంలో ఆశ్చర్యమేమీ లేదు. కానీ, నీకో విషయం చెప్పనా! నేను పది రూపాయలకోసం పదిమందిని దేబిరించిన రోజులున్నాయి. డబ్బు విలువేమిటో నాకు తెల్సు. ఈనాడిలా జనమంతా నా చుట్టూ తిరుగుతున్నారంటే కారణం డబ్బే! అయినా నీ కేం తక్కువైంది? ఎన్ని సౌకర్యాలూ...! హాయిగా ఉండరాదూ!" అనేసి పక్కల్లో పడిపోయాడు.

నాకు తెలుసు ఈ విలాసాలు, సౌకర్యాలు నాకు ఆనందాన్ని ఇవ్వలేవని. ఇవన్నీ నే నెరుగనివి కావు. నన్నెప్పుడూ బాధించేది ప్రేమలేనితనమే. అయినా, రవి చెప్పిందాంట్లో తప్పేమీ లేదు.

లెట్ అజ్ ఎంజాయ్ శారదా!

ప్రేమరాహిత్యం నిండిన పరిసరాల్లోంచి వచ్చిన నేను నిరంతరం ప్రేమను కోరుకుంటే ... దారిద్ర్యం అంటిన జీవితాన్ని చూసిన రవి డబ్బును కోరుతున్నాడు. అది సాధించి తన ఆధిక్యాన్ని సమాజానికి చూపుతున్నాడు.

ఇక నా కెప్పుడూ రవిపై కోపం రాలేదు. కానీ ఏదో అసంతృప్తి, అలసట ఆవరించినట్టు అనిపిస్తోంది జీవితంలో. ఇద్దరమూ ఉండే నాలుగు గజాల ఇంట్లో ఇద్దరిమధ్యా వందల మైళ్ల దూరం.

ఏదైనా అద్భుతం జరిగితే కానీ మారుపుండదు.

ఉద్యోగం ... సంసారం - సాగుతున్నాయి. సిన్సియారిటీ ఫలితంగా ప్రమోషన్ వచ్చింది.

సంసార ఫలం...!

అవును, నిజమే! నా అనుమానాన్నే నిర్ధారిస్తూ డాక్టర్ ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ చేసింది కంగ్రాట్స్ చెబుతూ.

ఏదో వింత అనుభూతి ... కాసింత ఆనందం.

ఎవరితో పంచుకోవాలి? రవి ... అతనికోసమే ఎదురు చూస్తున్నా.

అసలే ఫస్ట్ తారీఖు. బకాయిలు వసూలు చేసుకుని ఏ వేళకొస్తాడో...?

అనుకున్నట్టే అర్ధరాత్రికొచ్చాడు. అప్పటిదాకా మెల్లకువగానే ఉన్నా. రవి తాగి రావడంతో విషయం చెప్పాలనిపించలేదు. ఎప్పుడూ డ్రింక్ చేయడు. అప్పుడప్పుడూ... దురదృష్టంకొద్దీ ఇపుడు... ఎప్పుడలా వచ్చినా వెంటనే పడుకుంటాడు.

రవి ఎందుకు తాగుతాడో నాకు అర్థంకాదు. నా సాన్నిహిత్యం కూడా ఇవ్వని ఆనందం చిన్న సీసా మద్యం ఎలా ఇవ్వగలుగుతుందా అని నాకు ఆశ్చర్యం.

అయినా, జీవన పునాదులైన ప్రేమను, అనుబంధాలను మరచిపోయి, విశ్వాసాన్ని కోల్పోయి, ఏ మిథ్యా విలువలకోసమో, కోరికల సాధనకోసమో పరుగెత్తి... పరుగెత్తి ఆ ప్రయత్నంలో మనసంతా ఖాళీ చేసుకుని దాన్ని మద్యంలో నింపి జీవితాన్ని ఎంజాయ్ చేస్తున్నామని అనుకుంటారేమో...! రవికి సంబంధించి నాకు ఇంతకంటే లాజిక్ కనిపించడంలేదు.

రవి పడుకున్నాక నాకేం చేయాలో తోచలేదు. అలా కిటికీ దగ్గరికెళ్లి నిలుచున్నా.

నేను కావాలని పెద్దదిగా ఏర్పాటు చేసుకున్న కిటికీ. బయట సుందర దృశ్యాన్ని చూపుతోంది.

మేఘాలు తమ పొత్తిళ్లలో నెల బాలుడ్ని ఎత్తుకొస్తున్నాయి. ఏ దేవతల వరంతో పుట్టాడో దివ్యమైన తేజస్సు... పుట్టగానే వెలుగు సంద్రంలో కడిగారేమో... అప్పుడే వెన్నెల రాల్చుతున్నాడు.

వీడిని కన్నతల్లి గర్భంబు ధన్యంబు ...

అప్పుడే అమ్మతనపు ఆలోచనలు.

నవ్వొచ్చింది.

మెల్లగా కడుపుపైకి వెళ్లింది చేయి. ప్రాణి ఊపిరిపోసుకుంటున్న సవ్వడి.

సుపరిచితమైన కిటికీ చువ్వల స్పర్శ ఏదో తెలుస్తోంది నాకు! ■